క్లుప్తంగా

విద్యార్థులకు అవగాహన

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల కేంద్రంలో ఉన్న డాక్టర్ కె.ఆర్.ఆర్.ఎం డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థులకు విజిలెన్స్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ కృష్ణ మోహన్ ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులు పీఐడీపీఐ (పబ్లిక్ ఇంట్రెస్ట్ డిస్క్లోజర్, ప్రొటెక్షన్ ఆఫ్ ఇన్ఫార్మర్ రీసొల్యూషన్ -2024)పై అవగాహన కల్పించారు. సత్యనిష్ఠా సంస్కృతి, దేశ అభివృద్ధి కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కె. గిరిధరరావు, కె.సరళాదేవి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి బి. రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



తాడికొండ: మండల స్థాయిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా ఎంపికల్లో తమ పాఠశాల విద్యార్థులు 26 మంది ఎంపియ్యారని స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ నెమలికంటి మరియదాసు తెలిపారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల నుంచి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్‌కు అండర్-14, 17 విభాగాల్లో 30 మంది విద్యార్థులు పాల్గొనగా వీరిలో 26 మంది అత్యుత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. నియోజకవర్గ జట్టుకు ఎంపికవడం గర్వకారణమన్నారు. క్రీడలలో ఉత్తమ తర్ఫీదునిచ్చిన పీఈటీ సతీష్, ఎంపికైన విద్యార్థులను ఈ సందర్భంగా పలువురు అభినందించారు. 24న మేడికొండూరు మండలం సిరిపురంలో నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి పోటీలలో తమ విద్యార్థులు పాల్గొని ప్రతిభను ప్రదర్శించనున్నారని తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ పి.శేఖర్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటి వద్దే ప్రత్యేకావసరాల పిల్లలకు బోధన



తాడికొండ: ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు ఇంటివద్దే బోధన అందిస్తున్నట్లు తుళ్లూరు భవిత కేంద్రం ఉపాధ్యాయులు కె.ఉషారాణి, దేవిప్రియ తెలిపారు. భవిత కేంద్రంలో ప్రత్యేక విద్యాబోధన జరుగుతుందని, కానీ పాఠశాలకు రాలేని చిన్నారుల కోసం ప్రతి శనివారం పది మంది చిన్నారులకు ఇంటికి వెళ్లి బోధించడం జరుగుతుందన్నారు. ప్రత్యేకావసరాలు కలిగిన చిన్నారుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోగులకు సేవ చేసే అవకాశం రావడం అదృష్టం

గుంటూరు మెడికల్: సమాజంలో వైద్య వృత్తి ఎంతో ఉన్నతమైందని, రోగులకు సేవ చేసే అవకాశం లభించడం ఎంతో అదృష్టమని ప్రముఖ పిల్లల వైద్య నిపుణుడు, ఆలా హాస్పిటల్ అధినేత డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం స్థానిక అమరావతి రోడ్డులోని హాస్పిటల్‌లో ఎంబీబీఎస్ సీట్లు సాధించిన వైద్య విద్యార్థులను ఆయన అభినందించారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు నగదు, స్టెతస్కోప్‌ను అందజేశారు. ఈసందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైద్య వృత్తిలోకి వచ్చేవారు సేవాభావం కలిగి ఉండాలని, నిరంతరం విద్యార్థి మాదిరిగా ఉండి, నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. గుంటూరు జిల్లా తాడికొండ మండలం, పొన్నెకల్లు గ్రామానికి చెందిన ముగ్గురు ఎంబీబీఎస్ సీట్లు కన్వీనర్ కోటాలో పొందారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని ఎంబీబీఎస్ ఫ్రీ సీట్లు పొందిన ఒకే గ్రామానికి చెందిన వేమవరపు మృదులత, పల్లా త్రివేణి, బిందెల వెంకటగౌతమిలను డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు అభినందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నప్పటికీ విద్యార్థులు ఎంతో కష్టపడి చదివి ఉచిత ఎంబీబీఎస్ సీట్లు సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచారన్నారు.

'సైనేడ్' హంతకులపై మరో కేసు

తెనాలిరూరల్: బంగారం, నగదు, ఆస్తుల కోసం శీతల పానీయాలు, మద్యంలో సైనేడ్ కలిపి వరుస హత్యలు చేయడం ఇటీవలి కాలంలో కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. పట్టణ యడ్ల లింగయ్య కాలనీకి చెందిన వెంకటేశ్వరి, మునగప్ప రజినీ, రమణమ్మలు సైనేడ్‌తో పలువురిని హత్య చేసి ఇటీవల అరెస్టై రిమాండ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. అదే యడ్ల లింగయ్య కాలనీకి చెందిన గుమ్మడి శ్రీనివాస్, తన తల్లి గుమ్మడి నాగమ్మ (65)ను వీరే హత్య చేశారని భావిస్తున్నట్టు శుక్రవారం పోలీసులను ఆశ్రయించాడు. గతేడాది సెప్టెంబర్ 23న తన తల్లి మరణించగా సహజ మరణమని భావించామని, అయితే రమణమ్మ, వెంకటేశ్వరిలకు తన తల్లి రూ. 22 వేలు అప్పుగా గతంలో ఇచ్చిందని, వీరు చేసిన హత్యల గురించి ఇటీవల తెలుసుకోవడంతో అప్పు తీర్చకుండా తన తల్లిని హత్య చేసి ఉంటారని అనుమానంతో శ్రీనివాస్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు తెలిపారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత



పౌష్టికాహార ప్రదర్శన నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

ఫిరంగిపురం: గర్భిణులు పోషకాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత అన్నారు. మండలంలోని మేరికపూడి గ్రామం ఎస్టీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు తేలికగా తయారు చేసుకునే ఆహారం గురించి వివరించారు. ఆరేళ్ల లోపు చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని చెప్పారు. అనంతరం పోషక విలువలతో కూడిన ఆహారాన్ని గర్భిణులు, బాలింతలకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మావతి, బ్రహ్మారెడ్డి, కార్యదర్శి కె.విష్ణువర్ధన్‌రావు, మహిళా పోలీసు గాయత్రీ, వీఆర్వో బ్రహ్మయ్య, ఎంఎల్‌హెచ్‌పీ లింగరాజు, ఏఎన్ఎం పాపులమ్మ, అంగన్‌వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో పౌష్టికాహారం తయారీ

ఐనవోలు(తాడికొండ): గర్భిణులు, బాలింతలు రక్తహీనత నివారణకు తక్కువ ఖర్చుతో కూడిన పౌష్టికాహారం తప్పక తీసుకోవాలని ఐసీడీస్ మందడం సెక్టార్ సూపర్ వైజర్ సీతారావమ్మ సూచించారు. తుళ్లూరు మండలం మందడం సెక్టార్ ఐనవోలు గ్రామంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన ఆహార పదార్థాల తయారీపై నిర్వహించిన అవగాహనా సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సరైన ఆహార పద్ధతులు పాటిస్తే రక్తహీనతను నివారించి, భవిష్యత్తు తరాలకు పోషణ లోపం లేని సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. ఈ సందర్భంగా తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన ఆహారాన్ని తయారు చేయడంపై ప్రదర్శన నిర్వహించి, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విలేజ్ క్లినిక్ వైద్యురాలు డాక్టర్ సౌజన్య, పలువురు కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న పినపాటి జాన్‌పాల్

తాడేపల్లిరూరల్ : కొలనుకొండ రైల్వే స్టేషన్ పడమర వైపు నివాసముంటున్న 55 గిరిజన కుటుంబాలకు శనివారం తెనాలి మారిస్‌పేటకు చెందిన ఫ్లేవర్ హెల్ప్‌లెస్ మినిస్ట్రీస్ చైర్మన్ బిషప్ పినపాటి జాన్‌పాల్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బిషప్ జాన్ పాల్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు గిరిజన కుటుంబాలు ముంపునకు గురైనట్లు చెప్పారు. వీరికి నిత్యావసర సరుకులు, రగ్గులు పంపిణీ చేశామని తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ చర్మకార సేవా సంఘం అధ్యక్షుడు బుల్లా రాజారావు, డాక్టర్ శాస్త్రి, టీడీపీ నాయకులు మేకల అనిల్ కుమార్, ఎస్.శ్రీనివాసరావు, పి.గగారిన్, బీసీ కేశవులు, రాజశేఖర్, ఎస్.నాగమణి, సౌజన్య పాల్గొన్నారు.

ప్రతిభను ప్రోత్సహించాలి



విద్యార్థులకు పారితోషికం అందజేస్తున్న వజ్జా సాంబశివరావు

తాడికొండ: ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించడం వారు మరింతగా ముందుకెళ్లేందుకు ఉపయుక్తంగా ఉంటుందని వజ్జా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ వజ్జా సాంబశివరావు అన్నారు. తుళ్లూరు కేవీఆర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2024 పబ్లిక్ పరీక్షల్లో ప్రథమ స్థానం సాధించిన బాలుర, బాలికకు తమ ఫౌండేషన్ తరుపున రూ.10 వేలు పారితోషికం అందజేశారు. విశ్రాంత ఎస్ఆర్ఎం వర్శిటీ వీసీ వజ్జా సాంబశివరావు పాఠశాల పూర్వ విద్యార్థి కావడంతో ఏటా విద్యార్థులకు ప్రోత్సాహక పారితోషికాలు అందజేస్తున్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును సాంబశివరావు గురువు బి.శేషగిరిరావు పేరిట వ్యాయామ ఉపాధ్యాయిని పూదోట అనల కుమారికి ప్రదానం చేశారు. 10వ ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ ఎస్‌వీఎస్ సుదర్శన్, శివశక్తి ఫౌండేషన్ చైర్మన్ గోనుగుంట్ల లీలావతి, పలు పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ



పుష్కర ఘాట్ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో స్వచ్ఛతా హీ సేవ కార్యాక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్ బాషా మాట్లాడుతూ సీతానగరం పుష్కర ఘాట్‌ల వద్ద నుంచి రైల్వే ట్రాక్ వరకు చెత్తాచెదారాన్ని తొలగించడం, బ్లీచింగ్ చల్లడం, దోమల నివారణకు పిచికారీ చేయడం, ఫాగింగ్ నిర్వహించామని తెలిపారు. మొక్కల పెంపకం, పార్కులను శుభ్రపరచడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు, అమీనా బాద్ గ్రామాల్లోని దివ్యాంగ బాలలకు శనివారం ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. సంస్థ డైరెక్టర్ కె.సాల్మన్ పాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమకు చేతనైన రీతిలో దివ్యాంగ బాలలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌సీ పాఠశాల కమిటీ సభ్యుడు బి.రమేష్, మంగయ్య, షేక్. బాజీ పాల్గొన్నారు.

చలపతిలో రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేసిన విద్యార్థికి పండ్లు ఇస్తున్న ప్రిన్సిపల్

మోతడక(తాడికొండ): తాడికొండ మండలం మోతడక గ్రామంలోని చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. రక్తదాన్ అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా శ్రీ వెల్ఫేర్ సొసైటీ బ్లడ్ సెంటర్ సౌజన్యంతో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో 104 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా నాగ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడేందుకు రక్తదానం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. చదువుతో పాటు సమాజంలో బాధ్యతతో కూడిన వ్యక్తులుగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాధిపతి డి.శంకరరావు, అకడమిక్ డీన్ డాక్టర్ ఫణికుమార్, డాక్టర్ బాల మురళీ కృష్ణ, బ్లడ్ సెంటర్ డైరెక్టర్ పీవీఎస్ ప్రసాద్, డాక్టర్ అనిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు చోరీ చేసిన నలుగురి అరెస్ట్

మేడికొండూరు: విద్యుత్ వైర్లు దొంగలించుకుని పోతున్న నలుగురికి పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన మండలంలోని పేరేచర్లలో శనివారం తెల్లవారుజామున జరిగింది. ఫింగపురంలో నిర్మాణంలో ఉన్న ఒక అపార్టు మెంట్‌లో విద్యుత్ వైర్లను దొంగతనంగా తీసుకెళుతున్నట్లు సమాచారంతో పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన కొండ్రగుట్ల శివకృష్ణ, పేరేచర్ల గ్రామానికి చెందిన దేవకొండ అనిల్, షేక్ అబ్దుల్ కరీం, ఉప్పుతల సాయిని పోలీసులు అదుపులోకి తీసుకుని, విచారిస్తున్నారు.

ట్యాంకర్ ఢీకొని యువకుడి మృతి



మృతిచెందిన లక్ష్మణ నాగసురేంద్ర

మేడికొండూరు: ఆయిల్ ట్యాంకర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని పేరేచర్ల నరసరావుపేట బైపాస్ రోడ్‌లో శనివారం జరిగింది. కాకినాడ నుంచి ఆయిల్ ట్యాంకర్ లారీ కర్నూలుకు వెళ్తోంది. మార్గ మధ్యలో పేరేచర్ల - నరసరావుపేట రోడ్డులోని సర్వీస్ రోడ్డులో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ద్విచక్ర వాహనదారుడు ఎం.లక్ష్మణ నాగసురేంద్ర (20) లారీ వెనక టైర్ కింద పడడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడు ఫిరంగిపురం మండలం సుదురుపాడు గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులో తీసుకొని, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రమాద ఘటనపై మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కూరగాయల పంపిణీ

తెనాలిఅర్బన్: వరదల వల్ల సర్వం కోల్పోయిన కొల్లిపర మండలం కొత్తూరులంక గ్రామస్తులకు ఎన్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో శనివారం కూరగాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తమ కళాశాల ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ వీబీఎస్ అజయ్, అకడమిక్ కో-ఆర్డినేటర్ సురేష్ పాల్గొన్నారు.

కోకాకోలాకు నీటి కేటాయింపు తీర్మానం రద్దు చేయాలి

తెనాలి పట్టణ, పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం వినతి



కనెక్టింగ్ పైపులను పరిశీలిస్తున్న సంఘ నేతలు

తెనాలి: పట్టణ ప్రజల కోసం రూ.80 కోట్లపైపైగా వ్యయంతో ఏర్పాటు చేసిన మంచినీటి పథకంలో కొంత నీటిని కోకాకోలా కంపెనీకి కేటాయిస్తూ ఏడెనిమిదేళ్ల క్రితం మున్సిపాలిటీ చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని ది తెనాలి పట్టణ, పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం విజ్ఞప్తి చేసింది. శనివారం మంచినీటి పథకానికి సంబంధించిన కనెక్షింగ్ పైప్‌లైన్లను సంఘ నాయకులు పరిశీలించారు. 2009లో శంకుస్థాపన చేసిన పథకం 2014లో ప్రారంభించారని గుర్తుచేశారు. తర్వాత వచ్చిన ప్రభుత్వ హయాంలో అన్ని ప్రాంతాలకు పైపులైన్లు వేయకుండా, మంచినీటి కుళాయి కనెక్షన్లు ఇవ్వకుండా, ప్రజలు మంచినీటి కుళాయి కనెక్షన్లను తీసుకోవటం లేదని ప్రచారం చేసి, తెనాలికి వచ్చే కృష్ణాజలాల్లో కొంత కోకాకోలా కంపెనీకి ఇచ్చేలా మున్సిపాలిటీలో తీర్మానం చేసినట్టు తెలిపారు. ఆ తీర్మానం చేసే రోజుకు మునిసిపాలిటీ వారు ఆ స్కీంను పబ్లిక్ వర్క్స్ దగ్గర్నుంచి హ్యాండోవర్ కూడా చేసుకోలేదన్నారు. తమ సంఘం కోర్టులో కేసు వేసిన తర్వాత హడావుడిగా హ్యాండోవర్ చేసుకున్నట్టు తెలిపారు. అప్పటికి తెనాలిలో చాలా ప్రాంతాల్లో మంచినీటి పైపులు వేయలేదని తెలిపారు. ఇంకా రూ.10 కోట్ల విలువైన పనులు చేయాల్సి ఉన్నప్పటికీ వర్కులు పూర్తయినట్టుగా మున్సిపాలిటీ వారు సర్టిఫై చేసి, హ్యాండోవర్ చేసుకున్నారని తెలిపారు. అప్పటి నుంచి మరో రూ.5-6 కోట్ల మున్సిపాలిటీ డబ్బును ఖర్చుచేశారని వివరించారు. తమ విజ్ఞప్తి ప్రకారం ప్రస్తుతం కనెక్షింగ్ పైపుల పనులు జరుగుతున్నాయని, అలాగే కోకాకోలాకు నీరు ఇచ్చేందుకు గతంలో చేసిన మున్సిపల్ తీర్మానాన్ని రద్దుచేయాలని కోరారు. సంఘ అధ్యక్షుడు దరిశి శివకోటేశ్వరరావు, ఇతర బాధ్యులు రావూరి శివశంకరరావు, డీవీ సోమయ్య శాస్త్రి, యనమదల రమేష్‌బాబు, లక్కరాజు చిరంజీవి, అబ్దుల్ ఆరీఫ్, అబ్రహాం లింకన్, పోపూరి రామమోహనరావు, సాతులూరు రాజేష్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల బెదిరింపు



సచివాలయంలో ఉద్యోగి కుర్చీలో కాలిమీద కాలు వేసుకుని కూర్చున్న టీడీపీ నాయకుడు గాదె విజయభాస్కరరెడ్డి



ఉద్యోగిని ఆదేశిస్తున్న టీడీపీ గ్రామ అధ్యక్షుడు కుర్రా బ్రహ్మం

మంగళగిరి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం టీడీపీ నాయకుల బరితెగింపునకు అడ్డూ అదుపు లేకుండాపోతోంది. గుంటూరు జిల్లా నిడమర్రు సచివాలయంలో టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు కుర్రా బ్రహ్మం, నాయకుడు గాదె విజయభాస్కరెడ్డి శనివారం సచివాలయంలో వ్యవహరించిన తీరు సచివాలయ ఉద్యోగులతో పాటు గ్రామస్తులను ఆశ్చర్యానికి గురిచేసింది. సచివాలయానికి వెళ్లిన టీడీపీ నాయకులు ఉద్యోగుల కుర్చీల్లో కాలి మీద కాలు వేసుకుని అధికారులకు పలు ఆదేశాలిచ్చారు. తాము చెప్పినట్లు నడుచుకోవాలంటూ హుకుం జారీ చేయడం అధికారులను ఆందోళనకు గురిచేసింది. సచివాలయానికి పనులపై వచ్చిన ప్రజలతో సైతం ఇష్టానుసారం మాట్లాడారు. 'ప్రభుత్వం మాది మా ఇష్టం' అంటూ వ్యవహరించడం విస్మయానికి గురిచేసింది. టీడీపీ నాయకుల వ్యవహార తీరుతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అభ్యుదయ పితామహుడు గురజాడ



గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మస్తాన్ వలి

ఫిరంగిపురం: అభ్యుదయ పితామహుడు గురజాడ వెంకట అప్పారావు అని ప్రజా నాట్య మండలి జిల్లా కమిటీ సభ్యుడు ఎస్.మస్తాన్‌వలి అన్నారు. పొనుగుపాడు గ్రామంలో చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు 162వ జయంతిని శనివారం నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దురాచారాల్ని విమర్శిస్తూ ఆయన రాసిన కన్యాశుల్కం నాటకం ఎంతో ప్రాచుర్యాన్ని పొందిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా గురజాడ జయంతి

తాడేపల్లిరూరల్: మహా కవి, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీకారుడు గురజాడ అప్పారావు జయంతి వేడుకలను తాడేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు భీమిరెడ్డి తాతిరెడ్డి గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ గురజాడ అప్పారావు 1862 సెప్టెంబర్ 21న జన్మించారని, ఆయన రచించిన కన్యా శుల్కం నాటిక సాహితీ లోకంలో ఒక ప్రత్యేకమైన స్థానం సంపాదించుకుందన్నారు. ఆయన తెలుగు భాషకు చేసిన సేవలను, సాంఘిక దురాచారాలపై పోరాడిన తీరును వివరించారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా ఉపాధ్యాయుడు తుర్లపాటి అనిల్ కుమార్ వ్యవహరించగా, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాల దుష్ప్రభావంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న నవ జీవన్ బాలభవన్ నిర్వాహకులు

తాడేపల్లిరూరల్: కుంచనపల్లి అరవింద పాఠశాలలో విద్యార్థులకు నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో శనివారం మత్తు పదార్థాల దుష్ప్రభావంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు మాట్లాడుతూ మత్తు వదిలితేనే భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. ఎటువంటి మత్తు పదార్థాలు తీసుకున్నా అవి ప్రాణాంతకమేనన్నారు. స్నేహితులు, ఇతరులు మాదక ద్రవ్యాలు వాడమని ప్రలోభ పెడితే ఖచ్చితంగా వద్దు అని చెప్పాలని స్పష్టం చేశారు. విద్యార్థి దశలో ఒకసారి ధూమపానం, మద్యం, గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఏకాగ్రత కోల్పోయి మానసికంగా కృంగిపోవడం జరుగుతుందని వివరించారు. నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో-ఆర్డినేటర్ బి.రమేష్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన బాలలు, యువతను డీఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చన్నారు. ఇందుకు నవజీవన్ బాలభవన్ సంస్థ నూజివీడులో బోస్కో డీఎడిక్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేసిందని చెప్పారు. 94904 92020 నంబరుకు సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ బి.ఇంద్రాణి, అకడమిక్ ఇన్‌చార్జి పద్మా చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రవిశంకర్, ఉపాధ్యాయులు జె. శ్రీనివాసరావు, బి.కొండా నాయక్, జాన్సన్, ఎం.సాంబిరెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

చిగురు ఆశ్రమంలో నిత్యావసరాల పంపిణీ



నిత్యావసర సరుకులు, పుస్తకాలు పంపిణీ చేస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

తాడేపల్లిరూరల్: ఇటీవల కురిసిన అధిక వర్షాల కారణంగా వరద నీటితో మునిగిన సీతానగరంలోని చిగురు అనాథాశ్రమ బాలబాలికలకు వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ విభాగం వలంటీర్లు శనివారం నిత్యావసరాలు అందజేసినట్లు విద్యార్థి విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ తెలిపారు. ఏఐ, డేటా సైన్స్ విభాగం ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ వి.జోనితిన్ నీట మునిగిన ఆశ్రమాన్ని సందర్శించి, సాయం అందిస్తామని భరోసా ఇచ్చినట్లు చెప్పారు. ఆయన పిలుపు మేరకు దుస్తులు, దుప్పట్లు, రాత పుస్తకాలు, పెన్నులు, బియ్యం, కందిపప్పు, మినపగుళ్ళు, సబ్బులు, బిస్కెట్లు తదితర నిత్యావసరాలను అందజేసినట్లు తెలిపారు. తమ వంతు సాయంగా నిత్యావసరాలు అందించిన ప్రతి ఒక్కరికి వర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీకాంత్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి కో-ఆర్డినేటర్ పి.సురేష్ సమన్వయకర్తగా వ్యవహించారు. వీసీ డాక్టర్ పార్థసారథివర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ప్రిన్సిపల్ డాక్టర్ టి.కె.రామకృష్ణారావు, ఏఐడీఎస్ విభాగాధిపతి డాక్టర్ తిరుపతిరెడ్డి, విద్యార్థి విభాగాధి పతి సలహాదారులు డాక్టర్ హబీబుల్లా ఖాన్ వలంటీర్ల బృందాన్ని అభినందించారు.

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన ర్యాలీ

వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో పెదవడ్లపూడి గ్రామం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు, ప్రజలకు ప్లాస్టిక్ నిషేధంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

విద్యార్థి విభాగపు అధికారి డాక్టర్ ఏఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల మానవులకు, జంతువులకు ఎన్నో రకాల ఇబ్బందులు కలుగుతున్నాయని చెప్పారు. అనంతరం సీఈఏ విద్యార్థులు పాఠశాల నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఈఏ ప్రొఫెసర్ ఇన్‌చార్జి డాక్టర్ సుబ్రహ్మణ్యం, కో-ఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

ప్రకటన

[illegible]

రాయపూడి శ్రీనివాసరావు
తేది: 21-09-2024 అడ్వకేట్ & నోటరీ, సెల్: 98481 13820.

పేదలకు అన్నదానం

తెనాలి: స్థానిక వైకుంఠపురం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మాజీ డైరెక్టర్, సమైక్య వెండి వృత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి వంగల మాధవరావు ప్రథమ వర్ధంతి రోజైన శనివారం వారి కుటుంబసభ్యులు, సిబ్బంది సహాయంతో రైల్వే స్టేషన్ వద్ద అన్నదానం చేశారు.

